సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



ఆర్థికాభివృద్ధి సాధించాలి

మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. 8లో



ఘాట్ రోడ్డు క్లియర్

పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వచ్చే ఘాట్‌రోడ్డులో కొండచరియలు, చెట్ల తొలగింపు పనులు పూర్తయ్యాయి. 8లో



ఘనంగా సహస్ర దళార్చన

విశాఖ నగరంలోని సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు సహస్రాది తులసీదళాలతో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

నేటి 'జగనన్నకు చెబుదాం' ప్రత్యేక స్పందన వాయిదా

- ఈనెల 14న నిర్వహణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడి

సాక్షి, పాడేరు: స్థానిక ఐటీడీఏలో ఈనెల 8న నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో వాయిదా వేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల రోల్ అబ్జర్వర్ జె.శ్యామలరావు శుక్రవారం జిల్లాలో పర్యటించడమే కాకుండా పాడేరులో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కారణంగా స్పందన కార్యక్రమాన్ని వాయిదా వేశామని, ఈనెల 14వ తేదీన పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆ రోజు జరిగే కార్యక్రమానికి జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు.

వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ



యంత్ర పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: ప్రభుత్వం 90 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యేనాగులపల్లి ధనలక్ష్మి కోరారు. మండలంలోని కోతులగుట్ట వెలుగు కార్యాలయం వద్ద గురువారం 105 మంది గిరిజన రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, థైవాన్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, రాష్ట్రఎస్టీ కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జాబాబు, చింతూరు మండల కన్వీనర్ రామలింగారెడ్డి, సర్పంచ్‌లు కట్టం లక్ష్మి, సున్నం అభిరామ్, సోందె పాపారావు, దివాకర్, హరనాథ్, పూర్ణ పాల్గొన్నారు.

చలికి తాళలేక గిరిజనుడి మృతి



మృతుడు అప్పారావు

రాజవొమ్మంగి: మండలంలోని గింజర్తి గ్రామానికి చెందిన గిరిజనుడు కొంగర అప్పారావు (55) చలికి తాళలేక మృతి చెందినట్టు గ్రామ సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి తెలిపారు. ఆమె కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గిరిజనుడు అప్పారావు నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు బుధవారం సాయంత్రం రాజవొమ్మంగి వచ్చాడు. సరుకులు కొనుగోలు చేసి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గం మధ్యలోని వట్టిగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఒడ్డున ఓ చోట వేచి ఉన్నాడు. ఎంతకీ వాగు ఉధృతి తగ్గకపోవడంతో రాత్రంతా అక్కడే వేచి ఉన్న అప్పారావు చలికి తాళలేక సొమ్మసిల్లి పడిపోయాడు. గురువారం ఉదయం అతనిని గమనించిన రైతులు వెంటనే రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఏలేశ్వరం సీహెచ్‌సీకు 108లో తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారని సర్పంచ్ తెలిపారు. వంతెన లేకపోవడంతో ఈ వాగు దాటే ప్రయత్నంలో గత 20 ఏళ్లలో దాదాపు 18 మంది చనిపోయారని, ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మించాలని గింజర్తి, ఎర్రంపాడు గ్రామస్తులు కోరుతున్నారు.

పాడేరు డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు



ఐఎస్‌వో ధ్రువపత్రాన్ని చూపిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎస్‌ఐవో గుర్తింపు లభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చిట్టబ్బాయి తెలిపారు. ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎనర్జీ సేవింగ్ ప్రాక్టీసెస్, ప్రొవైడింగ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్, ఇంప్లిమెంటేషన్ ఆక్టివిటీస్ గుర్తింపులను కళాశాల సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ఐఎస్‌వో సిబ్బంది గురువారం విశాఖలో అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టిఎస్.రసూల్, సీనియర్ అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు అభినందించారు.

సహాయక చర్యలు ముమ్మరం

- తెరిపిచ్చిన వాన
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- తుపాను నష్టం సర్వేకు ఆదేశం



చింతపల్లి మండలం అన్నవరం ప్రాంతంలో వరి పొలంలోని వరద నీరు పోయేందుకు కాలువను తవ్వుతున్న వ్యవసాయ సహాయకుడు

సాక్షి,పాడేరు: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు గురువారం తెరిపివ్వడంతో అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో ప్రాణ, ఆస్తి నష్టాలను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అయితే సూచనలను పట్టించుకోని నలుగురు గిరిజనులు వాగు ప్రవాహాల్లో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. వరి తదితర వాణిజ్య పంటలకు మాత్రం కొంతమేర నష్టం వాటిల్లింది. పొలాల్లో నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించగలిగితే నష్టశాతాన్ని తగ్గించుకోవచ్చని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇప్పటికే సూచించారు. ఇందుకు అవసరమైన మోటార్లను అద్దెకు తెచ్చి వినియోగించాలని ఆయన సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వ పరంగా చెల్లిస్తామని, వెంటనే చర్యలు చేపట్టాలని అధికార యంత్రాగాన్ని ఆదేశించారు.

వెయ్యి ఎకరాల్లో వరి..

జిల్లా వ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. రాజ్‌మా, చిరుధాన్యాలు, ఇతర వాణిజ్య పంటలు, ఉద్యానవన పంటలకు కూడా నష్టం వాటిల్లిందని రైతులనుంచి అభ్యర్థనలు అందుతున్నాయి. వీటిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు పంట నష్టాలను పరిశీలిస్తున్నారు. వరి పనలు ధాన్యం రంగు మారకుండా, మొలకెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయశాఖ అవగాహన కల్పిస్తోంది.

నలుగురు గల్లంతుపై నివేదిక

గెడ్డలు, వాగుల్లో నలుగురు గిరిజనుల గల్లంతు విషాదాన్ని నింపాయి. అనంతగిరి మండలం లువ్వాగెడ్డలో ముగ్గురు గిరిజనులు గల్లంతు కాగా వీరిలో ఇద్దరు మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి ఆచూకీకోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. పెదబయలు మండలం పెదకోడాపల్లికి చెందిన గిరిజనుడు కిల్లో రామకృష్ణ మత్స్యగెడ్డలో చేపలవేట సాగిస్తూ జారిపడి మృతి చెందాడు. ఈ ఘటనలను కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు.

కిలో మిరియాన్ని రూ.500కు అమ్మండి

గిరిజనులు సాగుచేస్తున్న మిరియాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున కిలో రూ.500 ధరకు విక్రయించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధీనంలోని స్థానిక కాఫీ పల్పింగ్ యూనిట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాఫీ, మిరియాల సాగు చేస్తున్న రైతులతో ధరలపై సమీక్షించారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా పెద్దవ్యాపారులకు విక్రయించడం వల్ల గిట్టుబాటు ధర వస్తుందని సూచించారు. స్థానిక వర్తకులు తగిన ధరలకు మిరియాలను కొనుగోలు చేయని పక్షంలో ఫిబ్రవరి,మార్చి నెలల వరకు వేచి ఉంటే కిలో రూ.500కు అమ్మవచ్చన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్.నందు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం: ఎమ్మెల్యే ధనలక్ష్మి

కూనవరం: తుపాను కారణంగా పంటను నష్టపోయిన ప్రతిరైతుకు ప్రభుత్వం ఆదుకుంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని శబరికొత్తగూడెం, కొండ్రాజుపేట గ్రామాల్లో తుపానుకు దెబ్బతిన్న పంటలను గురువారం ఆమె పరిశీలించారు. ఏ ఒక్క రైతు అధైర్యపడొద్దని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతులకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. మిర్చి, పొగాకు, మొక్కజొన్న, మినుము పెసర పంటలు నీటమునిగాయని రైతులు ఎమ్మెల్యేకు తెలిపారు. దెబ్బతిన్న పంటల విషయంలో సమగ్ర సర్వే చేయాలని, ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా చూడాలని మండల వ్యవసాయాధికారి శ్రీలక్ష్మిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, సర్పంచ్ కట్టం లక్ష్మి, మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, ఆరెకటిక రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జా బాబు, కుంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

సాక్షి,పాడేరు: మిచాంగ్ తుఫాన్‌తో పంటలు నష్టపోయిన బాధిత గిరిజన రైతులందరికి ప్రభుత్వం బీమాతో ఆర్థిక పరిహారం పరిహారం పంపిణీ చేస్తుందని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తెలిపారు .డి.గొందూరు పంచాయతీలోని సూకురుపుట్టు సమీపంలోని వరద ముంపును గురైన వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం పంటనష్టంపై సమగ్ర సర్వే జరుపుతోందని, అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు.



జి.మాడుగుల మండలం వంతల ప్రాంతంలో నీట మునిగిన వరి పైరు



అడ్డతీగల ప్రాంతంలో నీటమునిగిన వరి పనలను బయటకు తీసేందుకు సహాయ పడుతున్న వ్యవసాయ సహాయకుడు



కూనవరం మండలం శబరి కొత్తగూడెం సమీపంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



సూకురుపుట్టులో ముంపునకు గురైన వరి పనలను పరిశీలిస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తదితరులు

పంట నష్టంపై సమగ్ర నివేదిక

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: మిచాంగ్ తుఫాన్‌తో ఏర్పడిన పంట నష్టాలపై సమగ్ర నివేదికలు అందజేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన మండలంలోని వంతాడపల్లి, తుంపాడ, వి.కరకపుట్టు ప్రాంతాల్లో ముంపునకు గురైన వరి, తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. వరి పొలాల్లో వరద నీటిని వెంటనే తొలగించి, వరి పనలను ఆరబెట్టాలని రైతులకు సూచించారు. ధాన్యం రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉండేలా రైతులకు సూచనలివ్వాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా పంటను కాపాడుకోవచ్చని ఆయన సూచించారు.



వంతాడలపల్లి ప్రాంతంలో తడిచిన వరిపనలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కాఫీ రైతుల ఆర్థిక ప్రగతికి ప్రణాళిక

కేంద్ర కాఫీ బోర్డు కార్యదర్శి, సీఈవో జగదీషా



చింతపల్లిలో కాఫీ పల్పింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఉన్నతాధికారి జగదీషా

చింతపల్లి రూరల్: రానున్న ఐదేళ్లలో కాఫీ రైతుల ఆర్థిక ప్రగతి పెంపునకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు కేంద్ర కాఫీ బోర్డు కార్యదర్శి, సీఈవో డాక్టర్ కేజీ జగదీషా పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక ఎకో పల్పింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జగదీషా మాట్లాడుతూ గిరిజన ప్రాంతం కాఫీ సాగుకు అత్యంత అనుకూలమన్నారు. రైతులకు ముఖ్య ఆదాయ వనరులు కాఫీ, మిరియమన్నారు. మంచి యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల లాభాలు పొందవచ్చన్నారు. కాఫీ తోటల విస్తరణతో పాటు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి అత్యధిక దిగుబడి వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కాఫీ తోటలల్లో అరటి, నిమ్మ, సుగంధ ద్రవ్య పంటల సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం చేకూరుతుందని సూచించారు. ఎఫ్‌పీవోలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తద్వారా నాణ్యమైన కాఫీ దిగుబడి చేయవచ్చన్నారు. రానున్న రోజుల్లో రైతులు నేరుగా కాఫీ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు డీడీ రమేష్, కాఫీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.అశోక్, జీసీసీ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు, కాఫీ బోర్డు మెంబర్ జె.ప్రభాకర్, మాక్స్ సొసైటీ అధ్యక్షుడు కొండలరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాఫీని గిట్టుబాటు ధరకు విక్రయించండి

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



కాఫీ రైతులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్



తడిచిన వరి పనలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

హుకుంపేట: గిరిజన రైతులు కాఫీ ఫలసాయాన్ని గిట్టుబాటు ధరకు విక్రయించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. గురువారం మండలంలోని లోచలిపుట్టు గ్రామాన్ని ఆయన సందర్శించారు. గిరిజన రైతులతో మాట్లాడారు. తుపాను పంట నష్టం వివరాలను పీవో తెలుసుకున్నారు. పార్చిమెంటు కాఫీ కిలోకు రూ.280 చొప్పున జీసీసీ ధర చెల్లిస్తోందన్నారు.

చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా కాఫీ పండ్లు కిలో రూ.43లకు కొనుగోలు చేస్తున్నారని వారు వివరించారు. జీసీసీ చెల్లించే ధరకన్నా తక్కువకు దళారులకు విక్రయించకూడదని సూచించారు. మంచి ధర వచ్చే వరకు పార్చిమెంటును నిల్వ చేసి ఉంచాలన్నారు. ఎకరానికి సుమారు రూ.60వేల ఆదాయం రావాలని అన్నారు. మిరియాలు కిలో రూ.500కు పైబడి విక్రయించాలని పేర్కొన్నారు. కాఫీ విక్రయాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. తుపాను వర్షాలకు ముంపునకు గురైన వరి పంటను పరిశీలించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

13న సామాజిక సాధికార బస్సు యాత్ర

- విజయవంతం చేయాలి
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపు



అరకులోయ పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, వైఎస్సార్‌సీపీ నేతలు

అరకులోయ టౌన్: నియోజకవర్గంలోని హుకుంపేటలో ఈనెల 13న నిర్వహించే అరకు అసెంబ్లీ నియోజకవర్గ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గురువారం అరకులోయ పట్టణంలో బస్సు యాత్ర విజయవంతం కోరుతూ పార్టీ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల పక్షపాతి జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి 2024లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివిధ పథకాల లబ్ధిదారులు విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బస్సు యాత్రలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితోపాటు మంత్రులు పాల్గొంటారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ్ కుమార్, ఎంపీటీసీ ఎల్‌బీ. భీమరాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, ఉమ్మడి జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, బొండాం సర్పంచ్ దురియా బాస్కర్‌రావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎల్‌బీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



శరభవరంలో అరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

దేవీపట్నం: ఏజెన్సీలో ప్రతీ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అన్నారు. మండలంలోని శరభవరం గ్రామంలో గురువారం ధాన్యం కల్లాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బయోమెట్రిక్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్నిఎంపిక చేసిన మిల్లులకు జియోట్రాకింగ్ ద్వారా ద్వారా వాహనాల్లో తరలిస్తామన్నారు. గత ఏడాది జిల్లాలో 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసిన పరికరాలు, గోనె సంచుల వివరాలను వ్యవసాయ అధికారుల నుంచి తెలుసుకున్నారు. తుపాను కారణంగా జరిగిన పంట నష్టం వివరాలను ఆయన సేకరించారు. పీహెచ్‌వో సీహెచ్ కేవీ చౌదరి పాల్గొన్నారు.

ముమ్మరంగా గాలింపు చర్యలు

- లువ్వాగెడ్డలో గల్లంతైన ముగ్గురిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం
- ఒక్కొక్క కుటుంబానికి తక్షణ సాయంగా రూ.లక్ష
- ప్రకటించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



తాటిపూడి జలాశయంలో గాలింపు చర్యలకు బయలు దేరుతున్న ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం



గోస్తనీ వద్ద కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీపీ శెట్టి నీలవేణి



కాశీపట్నం వద్ద మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, తదితరులు



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, అధికారులు

అనంతగిరి: మండలంలోని భీంపోల్ పంచాయతీ కేంద్రం సమీపంలోని లువ్వా గెడ్డలో గల్లంతైన ముగ్గురిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మండలంలోని సీతపాడు గ్రామానికి చెందిన గెమ్మెల లక్ష్మి, మిరియాల కమల, గెమ్మెల కుమార్ బుధవారం గెడ్డను దాటుతుండగా గల్లంతవడం తెలిసిందే. అరకు సీఐ రుద్రశేఖర్ పర్యవేక్షణలో అనంతగిరి ఎస్‌ఐ కరక రాము ఆధ్వర్యంలో ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్, రెస్క్యూ టీంలు రెండు బృందాలు వీడి గాలింపు గురువారం చర్యలు చేపట్టాయి. గల్లంతైన కిలోమీటరు దూరంలో గెమ్మెల లక్ష్మి, కాశీపట్నం సమీపంలోని గోస్తనీ నది వద్ద గెమ్మెల కుమార్ మృతదేహాలు లభ్యమయ్యాయి. మిరియాల కమల ఆచూకీకోసం తాటిపూడి నుంచి లువ్వా వరకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మృతుల కుటుంబాలకు అండగా..: ఎమ్మెల్యే పాల్గుణ

మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గోస్తనీ నది వద్ద కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబాలను ఓదార్చారు. ప్రభుత్వం తరపున అన్నివిధాలుగా ఆదుకుంటామని తెలిపారు. మృతురాలు అంగన్‌వాడీ టీచర్ గెమ్మెల లక్ష్మి కుటుంబానికి ఉద్యోగం వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. బాధిత కుటుంబాల్లో ఒకొక్కరికి తక్షణ సాయంగా రూ.లక్ష చొప్పున ప్రకటించారు. మృతదేహాలకు ఎస్‌కోటలో పోస్టుమార్టం జరిగేలా ఏర్పాట్లు చేశారు.

బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు: ఎమ్మెల్సీ రవిబాబు

కాశీపట్నం వద్ద మృతుల కుటుంబాలను గురువారం ఎమ్మెల్సీ కుంభా రవిబాబు పరామర్శించారు. ప్రభుత్వ నుంచి సాయం అందేలా కృషి చేస్తానన్నారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. లువ్వా గెడ్డపై బ్రిడ్జి వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలోని సీనియర్ ఐఏఎస్ అధికారి భరత్‌గుప్తాకు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.

పోస్టుమార్టం సమస్యను పరిష్కరిస్తాం: ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

అనంతగిరి మండల పరిధిలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన వారికి విజయనగరం జిల్లా ఎస్ కోట ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించేలా ప్రభుత్వానికి లేఖ రాసినట్లుగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు తెలిపారు. కాశీపట్నం వద్ద మృతుల కుటుంబాలను గురువారం ఆయన పరామర్శించారు.గిరిజనులను అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి పాల్గొన్నారు.

మృతదేహాలు ఎస్‌కోట తరలింపు

లభ్యమైన రెండు మృతదేహాలను ఎస్‌కోట ఏరియా ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లను ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ భీంపోల్ సర్పంచ్ భీమ్మలమ్మ పర్యవేక్షించారు. ఉదయం నుంచి ఘటన స్థలంలోని బాధిత కుటుంబాలను ఓదార్చి అండగా నిలబడ్డారు. ఈ కార్యక్రమంలోని జెడ్పీటీసీ గంగరాజు, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, వైఎస్సార్‌సీపీ మండలపార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, ఎంపీటీసీలు మితుల, అశోక్, తొటినాయుడు, సర్పంచులు పాగి అప్పారావు,కోఆప్షన్ సభ్యుడు మదీనా పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం: పీవో అభిషేక్



ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అనంతగిరి: బాధితులకు అండగా ఉంటామని, ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. లువ్వా గెడ్డ ప్రదేశాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం తాటిపూడి జలాశయం వద్దకు చేరుకుని, రెస్క్యూటీం, ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో మాట్లాడారు. తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీవో శ్రీహర్షిత్, ఆర్ఐ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు క్లియర్

- కొండ చరియలు, చెట్ల తొలగింపు పూర్తి
- శరవేగంగా చేపట్టిన ఆర్‌అండ్‌బీ అధికారులు

సాక్షి,పాడేరు: భారీ వర్షాలకు పాడేరు ఘాట్‌లో పలుచోట్ల విరిగిపడిన కొండచరియలు, చెట్ల తొలగింపు పనులు గురువారం రాత్రితో ముగిశాయి. బుధవారం రాత్రంతా ఘాట్‌లో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. గురువారం వాహనాలు వెళ్లేందుకు దారినిస్తూనే కొండచరియలు, మట్టిదిబ్బలు, చెట్లను తొలగింపు పనులను ఈఈ బాలసుందర బాబు పర్యవేక్షణలో ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు చేపట్టారు. యంత్రాలతో కొండచరియలను తొలగించారు. రాత్రికి పనులన్నీ పూర్తవడంతో ఘాట్ రోడ్డు క్లియర్ అయింది.

14 నుంచి ఆర్గానిక్ మేళా

మద్దిలపాలెం: ఆర్గానిక్ మేళా ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకూ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు భారత్ కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమార్ స్వామి తెలిపారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ మధ్య జరగాల్సిన ఆర్గానిక్ మేళా తుపాను కారణంగా మార్పు చేసినట్లు పేర్కొన్నారు. శివాజీ పాలెంలో గల గో ఆధారిత రైతు సంఘం కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 14న ఉత్తరాంధ్ర రైతులతో సమావేశం, 15న గ్రాడ్యుయేట్ రైతుల సమావేశం, 16న ఆర్గానిక్ వ్యాపారం చేసేవారితో సమావేశం, 17న మిద్దె పంట రైతుల సమావేశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి రైతు సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్య వర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం పాల్గొన్నారు.

కెమిస్ట్రీ కుదిరింది.. వేడుక అదిరింది

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థినుల డ్యాన్సులు





ఏయూక్యాంపస్: కొత్తగా కళాశాలలో అడుగిడిన విద్యార్థులకు అపూర్వ స్వాగతం పలికారు సీనియర్ విద్యార్థులు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ మందిరం ఇందుకు వేదికైంది. ఏయూ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. యువతులు చీరకట్టులో తళుక్కుమన్నారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. శాస్త్రీయ, వెస్టర్న్, జానపద నృత్యాలతో హోరెత్తించారు. కొంత మంది పాటలు ఆలపించి అలరించారు. వేదిక బయట ఏర్పాటు చేసిన ఫొటో స్పాట్ వద్ద ఫొటోలు తీసుకుని పదిలపరచుకున్నారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆచార్య పి.శ్యామల, ఆచార్య వి.సిద్ధయ్య, ఆచార్య కె.బసవయ్య తదితరులు మాట్లాడారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ పొందే దిశగా కృషి చేయాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కష్టపడాలని సూచించారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- మహిళా శక్తి పథకంలో ఆరుగురికి ఆటోల పంపిణీ



మహిళకు ఆటోను అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. మహిళాశక్తి పథకంలో మంజూరు చేసిన ఆటోలను గురువారం ఆయన ఐటీడీఏ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) పరిధిలో ఉన్నతి కార్యక్రమంలో ఆరుగురు మహిళలకు వడ్డీలేని రుణం కింద రూ.3.30 లక్షల విలువైన ఆటోలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ పథకంలో లబ్ధిదారు వాటాగా రూ.30వేల 343 చెల్లించాలన్నారు. సెర్ప్ నుంచి రూ.3 లక్షలు వడ్డీలేని రుణం ద్వారా ఆటోలను పంపిణీ చేశామన్నారు. రుణాన్ని 48 వాయిదాల్లో చెల్లించాలని సూచించారు. కొయ్యూరు మండలంలో వి.కనకరత్నం, చింతపల్లి మండలంలో అనగూరు విజయలక్ష్మి, అనంతగిరి మండలంలో ప్రధాని లీలావతి, పాడేరు మండలంలో దుసూరి కావేరి, హుకుంపేట మండలంలో గెమ్మిలి గీతతో పాటు మరో మహిళకు ఆటోలు అందజేశారు.

ధైర్యవంతులుగా పెంచాలి..

ఇక సహించం, నిశ్శబ్దాన్ని ఛేదిద్దామనే గోడపత్రికను పీవో ఆవిష్కరించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన ఉండాలని సూచించారు. ఆడ, మగ బిడ్డలనే వ్యత్యాసం లేకుండా పిల్లలను మహిళలు ఆడపిల్లలు పెంపకంపై చర్చించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వివిఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, ప్రత్యేక ఉప కలెక్టర్ వీవీఎస్.శర్మ, వెలుగు ఏపీఎంలు వీఎస్.ప్రసాద్, చిన్నారావు, వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేవీ డే ఫైనల్ రిహార్సల్స్ నేడే



సిద్ధం చేస్తున్న ప్రధాన వేదిక

బీచ్‌రోడ్డు: నేవీ డే వేడుకలకు సాగరతీరం సిద్ధమవుతోంది. శుక్రవారం నేవీ డే ఫైనల్ రిహార్సల్స్ ప్రదర్శించనున్నారు. ఇందుకు సంబంధించిన గురువారం ప్రాక్టీస్ చేశారు. ఈ నెల 2న ఫైనల్ రిహార్సల్స్, 4న నేవీ డే వేడుకలు నిర్వహించాల్సి ఉండగా.. మిచాంగ్ తుపాను కారణంగా వాయిదా వేశారు. ఈ నెల 8న ఫైనల్ రిహార్సల్స్, 10న నేవీ డే వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా తూర్పు నావికాదళం ఆర్.కె.బీచ్‌లో శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. గతంలోనే ఏర్పాట్లు పూర్తి చేయగా.. తుపాను కారణంగా అవన్నీ తొలగించారు. మళ్లీ మొదటి నుంచి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన వేదికతో పాటు గ్యాలరీలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఫైనల్ రిహార్సల్స్‌లో మెరైన్ కమాండోలు ఉగ్రవాదులపై దాడులు, స్కై డైవింగ్, హెలికాప్టర్లు, యుద్ధ నౌకలు, విమానాలతో బాంబు దాడులు, రెస్క్యూ ఆపరేషన్ తదితర విన్యాసాలు ప్రదర్శించనున్నారు. అనంతరం నేవీ బ్యాండ్ ప్రదర్శన ఉంటుంది. విన్యాసాలు తిలకించేందుకు వచ్చే ప్రజలు తినుబండారాలను తీసుకురావద్దని తూర్పు నావికాదళం అధికారులు సూచించారు.

తుది వేడుకలకు గవర్నర్ హాజరు

ఆదివారం జరిగే తుది వేడుకలకు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం తూర్పు నావికాదళాధిపతి రాజేష్ పెంధార్కర్ నేవీ హౌస్‌లో ఏర్పాటు చేసే ఎట్ హోమ్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, నౌకాదళ సిబ్బంది హాజరవుతారు.

20 లీటర్ల సారా స్వాధీనం

- ముగ్గురు మహిళల అరెస్టు

కొయ్యూరు: రాజేంద్రపాలెం పంచాయతీ సూరేంద్రపాలెంలో సారా తయారు చేసి విక్రయిస్తున్న ముగ్గురు మహిళలను అరెస్టు చేశామని ఎస్ఐ రాజారావు గురువారం సాయంత్రం తెలిపారు. వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. సారాతో అంబటి గంగమ్మ, సాగిన దేవి, అరిమెల ఆదిలక్ష్మి పట్టుబడగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ఆయా సెక్షన్ల పరిధిలో జరుగుతున్న భద్రతా, ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ నెల 8వ తేదీన న్యూ జల్పాయ్‌గురి–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22612) ఎక్స్‌ప్రెస్, న్యూటిన్‌సుకియా – కేఎస్ఆర్ బెంగళూరు (22502) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 9వ తేదీన అగర్తలా–ఎస్ఎంవీ బెంగళూరు (12504) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయినట్లు పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



పరదనపుట్టు వాగు వద్ద రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న చెట్టి వినయ్

పెదబయలు: మండలంలోని పెద్దకోడపల్లి పంచాయతీ పరదనపుట్టు గ్రామ సమీపంలో తుపాను వల్ల వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన గిరిజనుడు కిల్లో రామకృష్ణ(38) కుటుంబాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్ పరామర్శించారు. ప్రభుత్వం తరపున అన్ని రాయితీలు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. వాగులోని నుంచి తీసిన రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహం పోస్టుమార్టం కోసం కలెక్టర్, ఐటీడీఏ పివోలతో మాట్లాడి వైద్యులు, సిబ్బందిని రప్పించి దగ్గర నుంచి వాగు వద్దనే పోస్టుమార్టం చేయించారు.అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వినయ్ చూపించిన చొరవపై పరదనపుట్టు గ్రామస్తులు, రామకృష్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బోంజుబాబు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సురేష్, సర్పంచు చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, నాయకుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

8, 9, 10 తేదీల్లో డ్రోన్లు ఎగురవేయడం నిషేధం

అల్లిపురం: నేవీ డే పురస్కరించుకుని నగరంలో ఈ నెల 8, 10 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు శాంతి భద్రతల డీసీపీ–1 కె.శ్రీనివాసరావు తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఆయన ఈ వివరాలను విలేకరులకు వెల్లడించారు. నేవీ డే వేడుకలకు 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో బీచ్‌రోడ్‌లో డ్రోన్లు, గాలిపటాలు, లైట్ ల్యాంపులు వంటివి ఎగురవేయడం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. శుక్రవారం, ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు సాధారణ, విన్యాసాలు వీక్షించేందుకు వచ్చే వాహన చోదకులు, పాస్‌లు కలిగిన వారు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ఇవీ సూచనలు

- కలెక్టరేట్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ, సిరిపురం జంక్షన్ నుంచి ఆలిండియా రేడియో జంక్షన్ మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు, ఆలిండియా రేడియో జంక్షన్ నుంచి పాండురంగాపురం డౌన్ వరకు, నేవల్ క్యాంటీన్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు, పందిమెట్ట జంక్షన్ నుంచి నోవాటల్ హోటల్ వరకు, సెంచరీ క్లబ్ నుంచి నోవాటల్ హోటల్ వరకు పాస్‌లు లేని వాహనాలను అనుమతించరు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలి.
- ఎంవీపీ నుంచి బీచ్‌రోడ్డు గుండా, సిరిపురం నుంచి బీచ్‌వైపు వచ్చే సాధారణ వాహన చోదకులు పార్క్ హోటల్ పక్కన గల ఎంజీఎం గ్రౌండ్‌లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. పార్క్ హోటల్ మీదుగా బీచ్ రోడ్డులోకి రాకుండా బీచ్‌లోని ఎన్‌క్లోజర్స్‌లోకి కాలినడకన చేరుకోవాలి. పార్క్ హోటల్ నుంచి ఎటువంటి వాహనాలను బీచ్‌రోడ్డులోకి అనుమతించరు.
- వెహికల్ పాస్ కలిగిన వాహనచోదకులు వారికి కేటాయించిన ఏపీఐఐసీ గ్రౌండ్‌లోని గానీ, ఏయూ ఇంగ్లిష్ మీడియం మైదానంలో గానీ, ఫుట్‌బాల్ మైదానంలో గానీ పార్కింగ్ చేసుకోవాలి. అక్కడ నుంచి కాలినడకన బీచ్‌రోడ్డులో తమకు కేటాయించిన ఎన్‌క్లోజర్‌లోకి ప్రవేశించాలి.
- జగదాంబ జంక్షన్, సెవెన్‌హిల్స్ ఆస్పత్రి, కేజీహెచ్ వైపు నుంచి వచ్చే వాహనచోదకులు జిల్లా పరిషత్ ప్రాంగణంలో గానీ, ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానంలో గానీ పార్కింగ్ చేసుకోవాలి. కోస్టల్ బ్యాటరీ జంక్షన్ మీదుగా బీచ్‌రోడ్డులోకి రాకుండా బీచ్‌లోని ఎన్‌క్లోజర్‌లోకి ప్రవేశించాలి.
- నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ వరకు నివసిస్తున్న వారు పోలీసులకు సహకరించాలని డీసీపీ కోరారు. వేరే ప్రత్యామ్నాయ మార్గం లేకపోతే.. తమ ఆధార్ కార్డు చూపిస్తే.. సందర్భాన్ని బట్టి అనుమతిస్తామన్నారు.

ఏలేరు కాలువకు శరవేగంగా మరమ్మతులు

- తుపానుతో పలు చోట్ల కాలువ కోత
- రిజర్వాయర్ నుంచి నీటిని ఆపినా.. నష్టం కలిగించిన గెడ్డలు
- యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టిన అధికారులు
- జీవీఎంసీకి యథావిధిగా నీటి సరఫరా
- రూ.2 కోట్ల వరకు కాలువకు నష్టం: ఈఈలు



ఏలేరు కాలువను పరిశీలిస్తున్న విస్కో ఈఈ చిరంజీవి

నాతవరం: మిచాంగ్ తుపాను కారణంగా పలు చోట్ల ఏలేరు కాలువ కోతకు గురి కాగా.. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. మహా విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకున్నారు. కోతకు గురైన కాలువను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు ఏలేశ్వరం రిజర్వాయర్, విస్కో(విశాఖ) అధికారులు సంయుక్త నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వరకు 154 కిలో మీటర్ల పొడవున కాలువ ద్వారా నీరు ప్రవహిస్తోంది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముందుగానే అధికారులు మేల్కొన్నారు. తుపానుకు నాలుగు రోజుల ముందు వరకు కాలువలోకి రోజుకు 300 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా.. తర్వాత 120 క్యూసెక్కులకు తగ్గించేశారు. ఇటీవల ఏలేరు కాలువపై కొత్తగా నిర్మించిన చానల్ ద్వారా నీటిని తాండవ, శారదా నదిలోకి విడుదల చేయడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే అనేకచోట్ల గ్రామాలు, పొలాలు నీట ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండేది. అయినప్పటికీ గెడ్డలు ఉప్పొంగి ప్రవహించడంతో పలు చోట్ల ఏలేరు కాలువులోకి బయట నీరు వచ్చేసింది. దీంతో నీటి ప్రవాహం పెరిగి పలు చోట్ల కాలువ కోతకు గురైంది. కాలువ దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికారులు పనులు చేపట్టి జీవీఎంసీ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా గురువారం మండలంలోని ఏలేరు కాలువను ఏలేశ్వరం రిజర్వాయర్, విస్కో ఇంజినీర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం, విస్కో ఈఈలు భాస్కరరావు, చిరంజీవి మాట్లాడుతూ తుపాను కారణంగా ఏలేరు కాలువ పలు చోట్ల కోతకు గురికావడంతో సుమారు రూ.2 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని చెప్పారు. కాలువను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామని, నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. విస్కో డీఈ కామేశ్వరరావు, విశ్రాంత ఎస్ఈ జగన్‌మోహన్‌రావు, జేఈ వేగి నానాజీ, ఏలేశ్వరం రిజర్వాయర్ డీఈ వినోద్, జేఈ అప్పలరాజు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

- ఈపీడీసీఎల్ సేవలను ప్రశంసించిన స్పెషల్ సీఎస్
- తుపాను కారణంగా విశాఖ సర్కిల్‌కి రూ.1.46 కోట్ల నష్టం

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను సమయంలో ఈపీడీసీఎల్ సేవలు అద్భుతంగా ఉన్నాయని విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ అభినందించారు. సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడితో పాటు విద్యుత్ ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై చర్చించారు. తుపాను నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల పరిధిలోని 7 విద్యుత్ డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో విద్యుత్ అంతరాయాల నిరంతర పర్యవేక్షణ నిమిత్తం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు. తుపాను ప్రభావంతో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 21 నెం. 33/11కేవీ ఉప కేంద్రాలు మరమ్మతులకు గురవ్వగా త్వరితగతిన బాగు చేసి సరఫరా పునరుద్ధరించినట్లు సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్ వివరించారు. చెట్లు విరిగిపడి 11కేవీ స్తంభాలు 76, ఎల్‌టీ స్తంభాలు 208 విరిగిపోగా వాటిని 12 గంటల వ్యవధిలో మార్చామన్నారు. ఈ తుపాను వల్ల 16 మండలాల్లో 1,030 గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. మొత్తంగా మిచాంగ్ కారణంగా జిల్లాలో విద్యుత్ శాఖకు సుమారు రూ.1.46 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులకు ఎస్.మహేంద్రనాథ్ వివరించారు. మూడు రోజుల పాటు 1,76,384 మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను అధికారులు, విద్యుత్ సిబ్బంది జోరు వానలో కూడా 12 గంటల వ్యవధిలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంపై సీఎండీ పృథ్వీతేజ్ అభినందించారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఈ పవిత్రోత్సవాల్లో మొదటి రోజు అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం పవిత్ర ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు.

క్రషింగ్‌కు సర్వం సిద్ధం

- గోవాడ సుగర్స్‌లో బాయిలర్ పూజ
- 15న క్రషింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు

చోడవరం: ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ప్రారంభించేందుకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సిద్ధమైంది. ముందుగా గురువారం బాయిలర్‌కు పూజ చేశారు. ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని బాయిలర్ వెలిగించారు. ఈనెల 15 నుంచి క్రషింగ్ ప్రారంభించేలా యాజమాన్యం అన్ని పనులూ వేగవంతం చేసింది. ఈ ఏడాది 2.5 లక్షల టన్నుల చెరకు గానుగాడాలని లక్ష్యంగా పెట్టుకున్న గోవాడ ఫ్యాక్టరీ ఆ దిశగా చెరకును సేకరించేందుకు అన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటికే అగ్రిమెంట్ ఇచ్చిన రైతుల నుంచి పక్వానికి వచ్చిన చెరకు తోటలకు రస నాణ్యత పరీక్షలు జోరుగా నిర్వహిస్తున్నారు. యంత్రాలకు ఓవరాయిలింగ్ పనులు కూడా 90 శాతానికి పైబడి పూర్తి చేశారు. క్రషింగ్ ప్రారంభ సమయానికి విద్యుత్ సరఫరాతోపాటు స్టీమ్ ఎక్కువగా అవసరం కాబట్టి ముందుగా బాయిలర్‌ను ప్రారంభిస్తే ఆ సమయానికి అవసరమైన స్టీమ్ ఉత్పత్తి అయ్యి క్రషింగ్‌కు కావలసినంత అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా బాయిలర్ పనులకు పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు తిరుమలరావు, ప్రకాష్, ఫ్యాక్టరీ ఎండీ పీఏ రవి, సీఈ ప్రసాద్, సీఏఓ రామం, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి.భాస్కరరావు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాలకు పక్కా ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి జనవరి 11వరకు నిర్వహించనున్న మార్గశిర మాసోత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, ఉత్సవ సమన్వయ కమిటీ చైర్మన్ కె.ఎస్.విశ్వనాథన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

బంగారం చోరీ కేసులో ఇద్దరికి జైలు

విశాఖ లీగల్: ఓ మహిళ వద్ద బంగారం చోరీ చేసిన కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ నగరంలోని 12వ అదనపు జిల్లాకు న్యాయమూర్తి పి.గోవర్ధన్ గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వడ్లపాటి దేవానందరావు అందించిన వివరాలివీ.. మొదటి నిందితుడు ప్రసాద్ పెద్దపల్లె కాలనీలో, రెండవ నిందితుడు పెంటయ్య(22) ఎర్రవరంలో నివాసం ఉండేవారు. 2013 మే 18న యలమంచిలి పరిధి మరిబండ గ్రామ సమీపంలో పోలవరం కాలువ దగ్గర ఓ మహిళ మృతదేహాన్ని కనుగొన్నారు. అప్పటి వీఆర్వో ఈ విషయాన్ని యలమంచిలి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. మహిళపై లైంగిక దాడి చేసి, చంపినట్లు గుర్తించారు. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు మాయమైనట్లు వారి విచారణలో తేలింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితులుగా ప్రసాద్, పెంటయ్యగా గుర్తించారు. మృతదేహం తూర్పుగోదావరి జిల్లా తునిలోని కృష్ణకాలనీకి చెందిన 43 ఏళ్ల వనం వెంకటలక్ష్మిగా తేలింది. నిందితుల నుంచి బంగారం స్వాధీనం చేసుకుని.. వారిపై ఐపీసీ 302, 376, 379, 201 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో కేవలం బంగారం మాత్రమే వారు దొంగలించినట్లు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

'గంజాయి' నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ-1 శ్రీనివాసరావు తదితరులు

అల్లిపురం: 214 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న కేసులో పలువురిని అరెస్ట్ చేసినట్లు నగర శాంతిభద్రల డీసీపీ–1 కె.శ్రీనివాసరావు తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అచ్చియ్యమ్మపేటలో గత నెల 29న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సిబ్బందితో కలసి గంజాయి అక్రమంగా నిల్వ ఉంచిన ఉమ్మిడి ధనలక్ష్మి ఇంట్లో సోదాలు చేశారు. ఆ రోజు 214 కిలోల గంజాయి, 101 ప్యాకెట్ల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమాని అందించిన సమాచారం మేరకు ఆ ఇంటికి అద్దెకు తీసుకున్న చెవ్వాకుల రాముని అరెస్ట్ చేసి మరో ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జె్రిపోతుల తాతాజీ, జె్రిపోతుల రమణ అల్లూరి జిల్లా మద్రిపాడుకు చెందిన కొర్ర చిరంజీవి, శ్రీనులు నుంచి గంజాయి సేకరిస్తున్నారు. ఆదిరాజు నాయుడు ఏర్పాటు చేసిన వాహనాల్లో అధికారి కూర్మారావు సాయంతో జాన దుర్గాప్రసాద్, సంకిన శివకృష్ణ ఆ గంజాయిని నగరానికి చేరుస్తుండేవారు. ఆ గంజాయిని చెవ్వాకుల రాము ఎల్‌టీటీఈ, కోరమాండల్ రైళ్ల ద్వారా తమిళనాడు రాష్ట్రం తిరుచ్చికి చెందిన షేక్ మహమ్మద్ అబ్బాస్‌కు, అతని సహాయకుడు సిరాజుద్దింగ్‌కు సరఫరా చేస్తుంటాడు. పోలీసులు వారిని విచారించగా షేక్ మహ్మద్ అబ్బాస్ ముంబయికి చెందిన ఆముద, కునాల్‌లకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు అంగీకరించాడు. వీరందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. నిందితుల బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశామన్నారు.

అనుమానితులకు ఇళ్లు అద్దెకివ్వకండి

నగరంలో ఇళ్లు అద్దెకు ఇచ్చేవారు.. అద్దెకు దిగేవారి గురించి వివరాలు సేకరించాలని డీసీపీ కె.శ్రీనివాసరావు తెలిపారు. అద్దెకు దిగేవారి ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లు తీసుకోవాలని, అవసరమైతే పోలీస్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. అద్దెకు దిగిన వారు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా.. ఇంటి యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED FIELD EXECUTIVES
కావలెను. ఎటువంటి సేల్స్ మరియు టార్గెట్స్ ఉండవు. అర్హత: 10th పాస్
9100222928

WANTED
For A Reputed Surveying Company
1) AUTOCAD/ GIS Trainees: - 5 Nos. (M/F)
2) Surveyors: - 5 Nos. (M)
For Sl.No. 1 & 2 Age Limit:- 18 to 25 Years only
Qual: - Min. Inter/ ITI/Diploma/Degree - Freshers
3) Senior Surveyors: - 3 Nos. (M)
Min. 2 Years Working Experience With ETS/DGPS and AutoCAD Knowledge
4) Senior AUTOCAD/ GIS Analyst: - 3 Nos. (M/F)
Qual: - Diploma Civil/B.Tech Civil/ MSc Geography With Min. 2 Years Working Experience
Salary/Remuneration will be based on Experience for all the above positions.
Contact:- 8096336677, 9493940057
Email:- geoconsurveyspvtltd@gmail.com

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ BPT (Physiotherapy) B.Sc., MLT (Lab Tech.) Courses in Vijayawada - Affiliated to Dr. YSR Health University - Clinical Training in GGH, VJA. Ph : 88866 54339, 78930 47556 [V- 2281]

■ ONE SITTING : 10th, 12th, B.A, B.Com, B.Sc, M.Com, MBA, BBA, B.Tech., BCA, Veterinery/Fisheries/ Dairy Science. (Eligible for Govt Jobs) Cont ✆ : 73383 76874 [R-214]

Services

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా ధరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788962]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11342]

OLD AGE HOME

■ వృద్ధులకు మంచాన ఉన్నవారికి అహ్లాదకర వాతావరణంలో 8 వేలకే షేరింగ్ రూమ్ డాక్టర్లు, నర్స్ 24 గం॥ మీ ఇంటి వద్దకే సేవలు. @ పంజాబ్ హోటల్ జం॥ హైవే ప్రక్కన. ఫోన్: 63046 41223 [V- 676]

SEPTIC TANK CLEAN

■ బాలాజీ GVMC సెప్టిక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా అతి తక్కువ ఖర్చుతో 5 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 90009 29977, 90009 27171 [V-2284]

TOURS & TRAVELS

■ పంచారామాల యాత్ర : 10 - Dec - 2 రోజులు, భద్రాచలం : 22 - Dec - 2 రోజులు, శ్రీశైలం + రామేశ్వరం : 22 - Dec - 7 రోజులు - 11,000/- 23 యాత్రలు. శబరిమల : Dec. - 20 & 27. శ్రీ శివరామ టూర్స్ & ట్రావెల్స్ ఫోన్: 0891-4492952, 85005 53912/21, 99593 33384 [V- 5966]

Wanted

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221931]

■ సెక్యూరిటీగార్డులు కావలెను : 30 రోజులు గాజువాక / అనకాపల్లి ఏరియాల్లో పనిచేయుటకు. రోజుకి రూ॥ 500/-. సంప్ర : 98492 86773, 99631 57250 [V-2924]

■ మా ఆఫీస్ నందు టెలికాలింగ్ కొరకు ఉత్సాహవంతులైన టెలికాలర్స్ M/F కావలెను. కంప్యూటర్ నాలెడ్జ్, స్మార్ట్‌ఫోన్ గలవారు వెంటనే సంప్ర॥ ✆ 72078 89243 [O-191991]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221883]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K Ph: 9160900024/ 9640400073 [HA-925]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం